

మదనపల్లె జెడ్పీ హైస్కూల్లో స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీ స్థలంపై సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

ఈవీఎం, వీవీప్యాట్‌లకు భద్రత కట్టుదిట్టం

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలను నిర్దేశించిన గదుల్లోనే కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జేసీ పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికలకు ఉపయోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను వేర్వేరుగా ఉంచాలన్నారు. అలాగే మే 12వ తేదీ ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, సెక్టోరియల్ అధికారులకు ఈవీఎం, వీవీప్యాట్‌ల పంపిణీ, 13వ తేదీ ఎన్నికల తరువాత ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను తిరిగి తీసుకునేటప్పుడు చర్యల గురించి ఆర్డీవో హరిప్రసాద్‌కు పలు సూచనలు ఇచ్చారు. 259 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను చేర్చడానికి అవసరమైన రవాణా సదుపాయంపై ఆరా తీశారు. అలాగే జడ్పీ హైస్కూల్లో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, వాటి పర్యవేక్షణ ఎలా ఉండాలి అనే అంశంపై ఆర్డీవో హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాదరెడ్డితో చర్చించారు. దీంతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఫుడ్ కోర్టు, వేచి ఉండేందుకు షామియానాలు తదితర అంశాలపై సూచనలిచ్చారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, టూ టౌన్ సీఐ యువరాజు, డిప్యూటీ సర్వేయర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజుతో బాలసుబ్రమణ్యం భేటి

● పలువురు నేతలతో మంతనాలు, సమావేశాలు



టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుతో భేటి అయిన సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 8: టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో సోమవారం రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం భేటీ అయ్యారు. వీరిరువురు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజంపేట ఎమ్మెల్యే టికెట్టు కోసం పోటీపడ్డ జగన్‌మోహన్‌రాజు సుగవాసితో భేటీ కావడం పలు విషయాలు చర్చించడం రాజంపేట నియోజకవర్గ టీడీపీకి మరింత ఊపునిచ్చింది. అదేవిధంగా రాజంపేట మండల మాజీ అధ్యక్షుడు దివంగత కొండూరు రామరాజు కుమారుడు, వైసీపీ కీలక నేత కొండూరు శరత్ కుమార్‌రాజుతో సుగవాసి బాలసుబ్రమణ్యం చర్చలు జరిపారు. ఉమ్మడి కడప జిల్లా మాజీ టీడీపీ ఉపాధ్యక్షుడు రామకృష్ణంనాయుడు, రాజంపేట మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్‌రాజును పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట బీజేపీ సీనియర్ నేత పోతుగుంట రమేశ్‌నాయుడు సుగవాసితో భేటీ అయి తన మద్దతును ప్రకటించారు. టీడీపీ మహిళా నేత మిరియాల జ్యోతి సుగవాసికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, టీడీపీ యువ నేత పిడికిటి సంతోశ్‌నాయుడు, జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హాజరయ్యారు.



వైసీపీ సీనియర్ నేత శరత్‌కుమార్‌రాజుతో చర్చిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 8: ఈ ఏడాది అంతా జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ జిల్లా ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణరావులు కూడా జిల్లా ప్రజలకు నూతన తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ గిరీషాపై సస్పెన్షన్ ఎత్తివేత

● రెండున్నర నెలల తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాలు ● పోస్టింగ్ ఇవ్వమని సీఎస్‌కు ఆదేశాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ జనవరిలో సస్పెండు అయిన కలెక్టర్ పీఎస్ గిరీషా సస్పెన్షన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఎత్తి వేసింది. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓటరు కార్డులు తయారు చేసుకుని అధికార పార్టీ అక్రమాలకు పాల్పడింది. ఈ అక్రమాలకు అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన గిరీషా పూర్తిగా సహకరించాడనే ఆరోపణలపై గత జనవరిలో కేంద్ర ఎన్నికల సంఘం ఆయనను సస్పెండు చేసింది. ఈ సంఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అయితే తర్వాత ఇదే ఆరోపణలపై అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని సైతం కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండు చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ గిరీషా సస్పెన్షన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేస్తూ ఆరోపణలపై విచారణను పెండింగ్‌లో ఉంచినట్లు జాతీయ ఎన్నికల సంఘం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.ఎస్.జవహర్‌రెడ్డికి సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గిరీషాకు ఎన్నికల విధులు ఇవ్వకుండా ఇతర శాఖలలో పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

కలెక్టర్‌పై ఆరోపణలు ఏంటంటే..

2021లో తిరుపతి పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలవాలన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడింది. దేశ చరిత్రలోనే గతంలో ఎప్పుడూ జరగని విధంగా డూప్లికేట్ ఓటరు కార్డులను వేల సంఖ్యలో తయారు చేయించింది. ఈ ఓటర్లతో యథేచ్ఛగా ఇతర ప్రాంతాల నుంచి జనాలను పిలిపించి ఓట్లు వేయించుకుంది. అధికార పార్టీ చేసిన ఈ అరాచకం అంతా సాక్ష్యాలతో సహా దేశం మొత్తం చూసింది. తిరుపతి పార్లమెంటు స్థానంలోని నియోజకవర్గం కాకుండా పక్క నియోజకవర్గాలే కాకుండా పక్క రాష్ట్రం తమిళనాడు నుంచి సైతం బస్సుల్లో జనాలను తరలించి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసుకున్నారు. పలువురు దొంగ ఓటరు గుర్తింపు కార్డులతో ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌లకు వచ్చారు. ఈ వీడియోలు ఎలక్ట్రానిక్ మీడియా, సోషియల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈ దొంగ ఓట్ల వ్యవహారం చూసిన రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. మరీ ఇంత బరి తెగింపా అనుకున్నారు. ఆ సంఘటనను దాదాపుగా రాష్ట్ర ప్రజలు మర్చిపోయారు. అయితే అధికార పార్టీ చేసిన పాపం అధికారులను వెంటాడింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దొంగ ఓటరు కార్డులపై కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం ఉప ఎన్నికల నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఉన్న గిరీషా మెడకు చుట్టుకుంది. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోకి ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించి నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు డౌన్‌లోడ్ చేశారు. గిరీషా లాగిన్ ద్వారా ఈ కార్డులు డౌన్‌లోడ్ చేసినట్లు ప్రాథమికంగా ఉన్న ఆధారాల ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం నమ్మింది. దీంతో గిరీషాను సస్పెండు చేసింది.

జరిగిన వాస్తవం ఏంటంటే.?

కలెక్టర్‌పైన వేటు వేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసింది. ఈ విచారణలో వెల్లడైన ప్రకారం అప్పటికే చిత్తూరు జాయింట్ కలెక్టర్, తిరుపతి మునిసిపల్ కమిషనర్‌గా గిరీషా మూడు సంవత్సరాలకు పైనే పనిచేసి ఉన్నారు. దీని ప్రకారం తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో గిరీషా విధులు నిర్వహించకూడదు. అయితే ఈ విషయం గుర్తించని కేంద్ర ఎన్నికల సంఘం ఆయనను ఈఆర్‌వోగా నియమించింది. ఈ విషయం తెలిసిన స్థానిక అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈఆర్‌వోగా గిరీషాను తప్పించి ఆ స్థానంలో అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని నియమించిట్లు తెలిసింది. దీంతో ఎన్నికల విధులన్నీ ఆయనే నిర్వహించినట్లు తెలిసింది. ఈయన లాగిన్ ద్వారానే అధికార పార్టీ నాయకులు నకిలీ ఓటరు గుర్తింపుకార్డులు డౌన్‌లోడ్ చేసినట్లు సమాచారం. లాగిన్ సందర్భంగా ఓటీపీలు సైతం ఆయనకే వెళ్లినట్లు వెల్లడైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని విధుల నుంచి తప్పించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ గిరీషా తన సస్పెన్షన్ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి పూర్తి ఆధారాలతో విన్నవించుకున్నట్లు సమాచారం. ఆయన వినతిపైన విచారించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను పూర్తిగా ఎత్తివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. అదేవిధంగా త్వరలో జరగనున్న ఎన్నికల విధులు కేటాయించకుండా ఇతర బాధ్యతలు అప్పగించాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో కలెక్టర్ గిరీషా సస్పెన్షన్, అధికార పార్టీ తిరుపతి ఎన్నికల్లో చేసిన అక్రమాల వ్యవహారం మరొక్కసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు.

నోరుమెదపని అధికార పార్టీ

గత జనవరిలో అప్పటి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న గిరీషా, తర్వాత తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డితో పాటు ఇంకా పలువురు తహసీల్దార్ స్థాయి రెవెన్యూ ఉద్యోగులు సైతం అధికార పార్టీ దుర్మార్గానికి బలైపోయారు. అయితే ఇప్పటి వరకు ముఖ్యమంత్రితో సహా, ఆ ఉప ఎన్నికల్లో పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన గురుమూర్తి, అదే జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ ఇప్పటి వరకు కనీసం నోరు మెదపలేదు. రాష్ట్రానికి చెందిన ఒక ఐఏఎస్ అధికారి తీవ్ర ఆరోపణలతో కేంద్ర ఎన్నికల సంఘం చేత శిక్షింపబడితే.. ఇది మంచిదనో.? మంచిది కాదనో..? కూడా అధికార పార్టీ మాట్లాడలేదు. అధికారులకు నైతిక మద్దతు కూడా ఇవ్వలేదు. దీనిపైన ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా..? ఎవరు ఓడిపోయినా..? అధికారులకు ఒరిగేదేమీ లేదు. కేవలం తమ విధులు మాత్రమే నిర్వహిస్తారు. అయితే సాధారణంగా అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు ఎక్కువగా వింటారు. ఒకవేళ వినకపోతే ఆ అధికారి పనిచేసే స్థానంలోకి తక్షణమే మరొక అధికారి వచ్చేస్తారు. దీంతో అధికారులు అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగుతారు. దాని పర్యావసనం సర్వీసులోనే మాసిపోలేని నిందలు, శిక్షలకు గురవుతారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక వ్యవహారంలో బలైన కలెక్టర్ గిరీషా ఉదంతం కళ్లారా చూసినా.. రాష్ట్రంలో ఇంకా పలువురు పెద్ద పెద్ద అధికారులు, అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తడం మానలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు ఉద్యోగులపై కత్తి దూసిన కేంద్ర ఎన్నికల సంఘం అందుకు కారకులైన నాయకులు ఒకరిపైన కూడా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

రాజంపేటలో వైసీపీకి భారీ షాక్

● లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ప్రధాన నాయకులు

● హాజరైన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు, పోలి సుబ్బారెడ్డి ● వంద వాహనాల్లో పయనం

రాజంపేట, ఏప్రిల్ 8: రాజంపేటలో వైసీపీకి కోలుకోలేనంత షాక్ తగిలింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి చెందిన 70 శాతం మంది ప్రధాన నాయకులంతా వంద వాహనాల్లో వెళ్లి నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సోదరుడు సుగవాసి ప్రసాద్‌బాబు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ రాజంపేట వైసీపీ నాయకులు ఆరు మండలాల నుంచి చేరడం చాలా సంతోషదాయకమని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారందరికీ తగిన ప్రాధాన్యత ఇస్తామని, రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలి సుబ్బారెడ్డి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పార్టీలో చేరుతున్న వారిని పరిచయం చేశారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో అధ్యక్షులు, ప్రధాన నాయకులు మొత్తం 60 మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరినట్లు పోలి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన అందించిన సమాచారం మేరకు టీడీపీలో చేరిన వారిలో సుండుపల్లి మండల వైసీపీ సీనియర్ నాయకుడు శివారెడ్డి, సుండుపల్లి నాయకులు శ్రీనివాసులురెడ్డి, సిద్దవటం మండలాధ్యక్షురాలి కుమారుడు జ్యోతిచంద్రశేఖర్, సిద్దవటం సింగిల్‌విండో అధ్యక్షుడు జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, బాకరాపేట సర్పంచ్ తనయుడు ప్రతాప్‌నాయుడు, ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, మం డల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ సుబ్బరాయుడు, చింతరాచుపల్లె సర్పంచ్ రమణ, మంటపంపల్లె ఎంపీటీసీ సుంకేసుల బాషా, జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, రమణ, మాచుపల్లి సర్పంచ్ విజయబాస్కర్ రెడ్డి, వరదయ్యగారిపల్లె సర్పంచ్ నారాయణ, మిట్టమీదపల్లె సర్పంచ్ రెడ్డెయ్య, టంగుటూరు సర్పంచ్ మొహిద్దీన్, ప్రతాప్ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.



నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, చిత్రంలో రాంగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌బాబు, పోలి సుబ్బారెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

● పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 8: జిల్లాలో ఎండ తీవ్రత, వడగాడ్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లోని ముఖ్య కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని, వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండవచ్చన్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సూచనల నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఉదయం 10.30 లోపు ఉపాధి హామీ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లలో నీటి సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపకశాఖ 101 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, వేసవిలో అధిక ఉష్ణోగ్రతకు ఏర్పడే విద్యుత్ సమస్యలపై తగిన పర్యవేక్షణ చేయాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సత్యనారాయణ, డ్వామా, వైద్య, ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యుఎస్, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

పట్టాభిరాముడి వైభవం చూతము రారండి..



గ్రాసముద్రతో పట్టాభిరాముడి దర్శనం

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు



వాల్మీకిపురం పట్టాభిరామాలయం



● 11న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ● టీటీడీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు

వాల్మీకిపురం ఏప్రిల్ 8: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభి రామాలయంలో ఈనెల 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేలా టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

11న అంకురార్పణ


ఈనెల 11వ తేదీ గురువారం సాయంత్రం పట్టాభిరాముడికి అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు తెలిపారు. 12వ తేదీ శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం గజవాహన సేవ, 13న శనివారం ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం హనుమంత వాహనసేవ, 14న ఆదివారం కల్పవృక్ష వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, సింహవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం 15న సోమవారం ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం పెద్దశేషవాహనం, 16న మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, మోహిని ఉత్సవం, 17న బుధవారం సాయంత్రం సీతారాముల కల్యాణం, రాత్రికి గరుడ వాహన సేవ, 18న గురువారం ఉదయం రథోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం, 19న శుక్రవారం ఉదయం తిరుచ్చి, సాయంత్రం అశ్వ వాహన సేవ, పార్వేట ఉత్సవం, 20న శనివారం ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం హంసవాహనసేవ, రాత్రికి ధ్వజావరోహణ, 21న ఆదివారం చివరి రోజున ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం పట్టాభిరాముడికి పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆలయ ప్రాశస్తి

శ్రీరామచంద్రమూర్తి వాల్మీకి మహర్షికి దివ్య దర్శన భాగ్యాన్ని కలిగించిన ప్రాంతం వాల్మీకిపురం. అత్యంత ప్రాచీన ప్రాశస్తి కలిగిన పట్టాభిరామాలయంలో లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమంతుడితో సీతాసమేతంగా పట్టాభిరాముడిని పరమ ఇష్టాగరిష్టులైన జాంబవంతుడు ప్రతిష్ఠించినట్లుగా చరిత్ర చెబుతోంది. వాల్మీకము (పుట్ట) నుంచి శ్రీరామచంద్రమూర్తి బయట పడినందున ఈ ప్రదేశం వాల్మీకిపురంగా ప్రసిద్ధి చెందింది. పట్టాభిరాముడికి దక్షిణ హస్తమున గ్రాసముద్ర, వామహస్తమున వరద ముద్రతో (వైకుంఠ హస్తము) తేజోవిరాజితులై ఉన్నారు. సీతమ్మకు కుడివైపున భరతుడు, శ్రీరామునికి ఎడమ వైపున ధనుర్బాణ ధారియై లక్ష్మణుడు, లక్ష్మణుడికి ఎడమ వైపున శత్రుఘ్నుడు ఉన్నారు. శ్రీరంగనాథస్వామి ఆలయం, పాండురంగ విఠలేశ్వరాలయం, మహాలక్ష్మీ అమ్మవారు, వీరాంజనేయ స్వామి దేవతామూర్తులు ఆలయంలో కొలువై ఉండడం విశేషం. పట్టాభి ఆలయ విమానం సుదర్శన విమానంగా ప్రసిద్ధి పొందింది. ఈ సుదర్శన విమానం చోళరాజుల శైలితోనూ, మండప ద్వార గోపురాలు విజయనగర శైలితో అత్యంత సుందరంగా ఉన్నాయి. పట్టాభిరాముడికి దక్షిణ భాగంలో సీతమ్మవారు ప్రతిష్ఠింపబడి ఉన్నారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఆశ్లేష నక్షత్రంలో ప్రతి చైత్ర మాసంలో పట్టాభిరాముడి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు వావిలపాటి వీర ప్రతాపరామ అంటూ పట్టాభిరాముడిపై 20కిపైగా కీర్తనలు రచించినట్లు చరిత్ర చెబుతోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగవల్లికలు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు భక్తులకు సౌకర్యాలు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

వాల్మీకిపురానికి 'మహర్షి' ముద్ర

వాల్మీకిపురం పట్టణ పరిసరాలలోని శతశృంగ పర్వతాలలో వాల్మీకి మహర్షి తపస్సు ఆచరించినట్లుగా చరిత్ర చెబుతోంది. వాల్మీకి మహర్షి రాముడి కాలంలో జరిగిన విషయాలను సాదృశ్యంగా కనిపించేలా బ్రహ్మదేవుడి వరం పొందడం విశేషం. రాముడి పట్టాభిషేకం అనంతరం రామాయణం రాసినట్లుగా, అనంతరం నారద మహర్షి రామ మంత్రాన్ని (మరా) ఉపదేశించినట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శతశృంగ పర్వతాలలో వాల్మీకిపురం మహర్షి తపస్సు ఆచరించడం వాల్మీకిపురం అనే పేరు రావడం, పట్టణ సమీపంలోని వానరకొండల ప్రాంతంలో వాల్మీకి మహర్షి తపోదీక్ష నీడ నేటికీ దర్శనమిస్తోంది. రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కగా కనిపించే ఈ దృశ్యాన్ని చూసి భక్తులు మంత్రముగ్ధులవుతుంటారు.



వాల్మీకిపురం కొండపై వాల్మీకి మహర్షి తపోదీక్ష దృశ్యం

రాజుకుంటలో జనసేన అభ్యర్థి ప్రచారం


అనుంపల్లిలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి అరవ శ్రీధర్

చిట్వేలి, ఏప్రిల్ 8 : మీ అమూల్యమైన ఓటు గాజు గ్లాసుకు వేసి గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి అరవ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని రాజుకుంట పంచాయతీ అనుంపల్లి గ్రామం, అశోక్ నగర్ ఎస్టీ కాలనీ, చెరోపల్లె పంచాయతీలో రాజుకుంట పంచాయతీ సర్పంచ్ గుత్తి నరసింహ, ఎంపీటీసీ నాగార్జున, ముక్కా రూపానందరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, ముక్కా వరలక్ష్మీ తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు సేకరిస్తూ, రానున్నవి మంచి రోజులని, ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు కష్టాలను, నష్టాలను అనుభవిస్తున్నారన్నారు. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో సుపరిపాలన రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతయ్య యాదవ్, గంగయ్య యాదవ్, స్పోక్స్‌పర్సన్ బాలకృష్ణ యాదవ్, ముక్కా శిరీష, మాదాసు నరసింహ, వేణుగోపాల్‌రెడ్డి, మహిళా నేత అనిత దీప్తి, జ్యోతి, మాదినేని నరేష్, రాజా ఈశ్వరయ్య, వెంకటయ్య, శ్రీను, తేజ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ స్కీం పైపులైను పరిశీలన


లింగంపల్లె వద్ద మాట్లాడుతున్న కడప టీడీపీ అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు

సిద్దవటం, ఏప్రిల్ 8 : తెలుగుదేశం పార్టీ కడప ఎంపీ అభ్యర్థి భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి సోమవారం సిద్దవటం మండలం లింగంపల్లె సమీపంలోని కడప వాటర్ స్కీం పైపులైను పరిశీలించారు. ఇటీవల మాధవిరెడ్డి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కడపలో తిరుగుతున్న సమయంలో ఎక్కడికి వెళ్లినా తాగునీటి సమస్య పై ప్రజలు విన్నవించడంతో ఆమె పైపులైనును పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి తదితరులు టీడీపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ లక్ష్యం


కుమ్మరపల్లెలో లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రచారం

గాలివీడు, ఏప్రిల్ 8: ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోరాన్‌చెరువు, గోపనపల్లె పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా అమలయ్యాయన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అనంతరం చంద్రబాబు అమలు చేయనున్న వివిధ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పూలుకుంట సర్పంచ్ పార్థ సారథి రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, మాజీ ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు కరిమిరెడ్డి కుమార్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, శివ, శ్రీకాంత్, నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, టోపీవలి, బాషా, చెన్నయ్య, రెడ్డెప్పరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం విద్యార్థులకు ఆర్థిక సాయం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 8: నిరుపేద ముస్లింల సంక్షేమానికి ఆజాద్ ఎడ్యుకేషనల్ మైనార్టీ వెల్ఫేర్ సేవా సొసైటీ సేవలు అభినందనీయమని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమ వారం రాయచోటి పట్టణంలోని మార్కెట్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 150 మంది పేద విద్యార్థులకు రూ.75 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ మొహమ్మద్ హషీం మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి చేతనైన సాయం చేసే గుణం అలవర్చుకోవాలని తెలిపారు. ఆజాద్ ఎడ్యుకేషనల్ మైనార్టీ వెల్ఫేర్ సేవా సొసైటీ అధ్యక్షుడు సయ్యద్‌షా హమీద్ రెహమాన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌అలీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మొహమ్మద్ సిబాతుర్ రెహమాన్, కార్యదర్శి జాఫరుద్దీన్, కోశాధికారి మహీబుల్లా, దాత పఠాన్ రియాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెజారిటీ సాధనకు కృషి చేయండి

● టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఏప్రిల్ 8: బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలు అత్యధికంగా ఉండే రాజంపేట పట్టణంలో వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఓట్లు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజంపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం రాజంపేట టీడీపీ కార్యాలయ ఆవరణలో రాజంపేట పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, బూత్ కన్వీనర్లు, నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు అతి సమీపంలో ఉన్నాయని, తనకు తక్కువ సమయం ఉందని, ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా, ఆత్మీయంగా మాట్లాడటానికి సమయం సరిపోవడం లేదని, ప్రతి ఒక్కరూ ఒక సైనికునిగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును చేసుకుంటేనే రాష్ట్రానికి తిరిగి మంచి రోజులు వస్తాయన్నారు. రాజంపేట పట్టణంలోని అన్ని వార్డుల టీడీపీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, అన్ని ప్రాంతాల క్లస్టర్ నేతలు, వివిధ విభాగాల పార్టీ నాయకులు నడుం బిగించి మమ్ములను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, రాజంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, లీగల్‌సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా కలిసికట్టుగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి అబుబకర్, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మాలేపాటి రామకృష్ణమ నాయుడు, టీడీపీ పట్టణ మాజీ పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, గుగ్గిళ్ల చంద్రమౌళి, మైనారిటీ నాయకులు జాఫర్, కరీం, కరీముల్లా, జనసేన నాయకులు వెంకటయ్య, కత్తి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా : మండిపల్లి


ఏకిలపల్లెలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

రామాపురం, ఏప్రిల్ 8: తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతానని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ ఏకిలపల్లె, కొత్తపల్లె, నడిగడ్డపల్లె గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఏకిలపల్లెలో నాగిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వెంకట సుధాకర్‌రెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, జయరాంరెడ్డి, పక్కీరారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, వార్డు నెంబర్ షేక్ సర్దార్‌హుస్సేన్, రమేశ్, చిన్నవెంకట్రమణ, పహ్లాద్‌రెడ్డి, వెన్నుపోతుల రమేశ్, నారాయణరెడ్డి, తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో గాలివీటి సురేంద్రరెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, పురం క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణ గౌడ్, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మల ఓబులేశ్, చెన్నూరు బాబు, ఇమామ్‌ఖాసీం, లక్ష్మిరెడ్డి, మల్లికార్జున, చీకటి రమేశ్ నాయుడు, కదిరి శ్రీనివాసులు, గంగాధర, దశరథ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపేట రామాపురంలో జననీరాజనం

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని 18వ వార్డులో సోమవారం టీడీపీ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు మోహన్‌రావు, రెడ్డెయ్య, ఎర్రశివ, నల్లశివ, రమణ, చిన్నరెడ్డెయ్య, వార్డు నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం చౌడేశ్వరి ఆలయం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రాయచోటి ప్రజల రుణాన్ని తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు శివగంగిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక


నారా లోకేశ్, ప్రసాద్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరిన రవిశంకర్

వీరబల్లి, ఏప్రిల్ 8: వైసీపీ బీసీ సంఘ నాయకులు కోటగుంట్ల రవిశంకర్ సోమవారం నారా లోకేశ్ బాబు, టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు సమక్షంలో టీడీపీలోచేరారు. వైసీపీ అధినేత వైఖరితీవ్రంగా బాధించడంతో ఆ పార్టీలో కొనసాగకూడదని నిశ్చయించుకుని టీడీపీలోకి చేరినట్లు రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఓదివీడుకు కు చెందిన సారథిరాజు సురేంద్రరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి


ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడించిన గ్రామస్తులు

సంబేపల్లె, ఏప్రిల్ 8: తాగునీటి సమస్య తీర్చాలంటూ మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం కుమ్మరపల్లి వాసులు సోమవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. నెల రోజులు గా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. వ్యవసాయ బోర్ల నుంచి కూడా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మండుతుండడంతో మూగజీవాలు సైతం తాగునీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో నిర్మలాదేవికి విన్నవించారు.

సార్వత్రిక ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 8: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అన్నమయ్య జిల్లా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గట్టి నిఘా ఏర్పాటు చేయడమే కాకుండా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి బయట ప్రాంతాల నుంచి నగదు, మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని డీఐజీ విజయరావు ఆదేశించారు.

ఓటు అడిగే నైతిక హక్కు వైసీపీకి లేదు

సుండుపల్లె, ఏప్రిల్8: సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఓటు వేయమని అడిగే నైతిక హక్కును వైసీపీ కోల్పోయిందని రాజంపేట సీపీఐ అభ్యర్థి విశ్వ నాథ నాయక్ తెలిపారు. సోమ వారం సుండుపల్లె మండల కేం ద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలేల విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడారు. రాజంపేట నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నియోజకవర్గమంతా తిరిగి ఓటు అడుగుతున్నా రని ఆయన ప్రశ్నించారు. అక్రమాలు, అరాచకాలకు నిలయంగా ఈ ఐదేళ్ల పాలన సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడ సంఘం జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హఫీజుల్లా, మహబూబ్ బాషా, హసన్‌బాషా పాల్గొన్నారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి

రాజంపేట, ఏప్రిల్ 8 : ప్రతి ఓటరు తమ ఓటు హక్కును క్షుణ్ణంగా సక్రమంగా వినియో గించు కోవాలని, ప్రలోభాలకు లోను కావద్దని ఎన్నికల రిట ర్నింగ్ అధికారి టి.మోహన్‌రావు తెలిపారు. సోమవారం పట్టణం లోని సబ్‌కలెక్టర్ కార్యాలయం నుండి పాత బస్టాండు కూడలి వరకు అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి భారతదేశ పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించు కోవాలని, ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే నూరు శాతం ఓటరు నమోదు వినియోగంతో పటిష్టమైన ప్రజాస్వామ్యం సాధ్య మవుతుందన్నారు. కార్యక్రమం అనంతరం పాత బస్టాండు కూడలి నందు మానవ హారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చైతన్య, రాజంపేట తహసీల్దారు ఇన్బనాథన్, ముని సిపల్ కమిషనర్ రాంబాబు, నోడల్ అధికారి, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పనులు కల్పించాలి

పెనగలూరు, ఏప్రిల్ 8 : ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించే విధంగా సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రతాప్ కోరారు. సోమవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే కూలీలకు తప్పనిసరిగా వంద రోజులు పనులు కల్పించే విధంగా లక్ష్యంగా పెట్టుకొని పని చేయాలన్నారు. కూలీలకు డబ్బులు బాగా వచ్చే విధంగా ఎన్ని గంటలు పని చేయాలన్నా దానిని వివరించి తెలపాలన్నారు. ప్రతి కూలీకి 250 రూపాయలు తక్కువ కాకుండా కూలి వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. మస్టర్లను ఏ రోజుకారోజు క్షుణ్ణంగా తనిఖీ చేసుకొని శనివారం ప్రతి మస్టర్ అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో మురళీ, టెక్నికల్ అసిస్టెంట్ వీరయ్య, సునీల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వీరబల్లి, ఏప్రిల్ 8: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని పెద్దివీడు, రాగిమాను దిన్నెపల్లె, పుత్తావాండ్లపల్లె, వంగిమళ్ల, ఉప్పరపల్లె గ్రామాల్లో వీరబల్లి పోలీసులు కేంద్ర బలగాలతో నాకాబందీ, గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముక్కాను కలిసిన సతీష్ వేమన

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 8: రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని తానా మాజీ ప్రెసిడెంట్, నియోజకవర్గ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి వేమన సతీష్ సోమవారం కలి శారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేం దుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ సొంత మండలా నికి చెందిన ముక్కా రూపానందరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా అరవ శ్రీధర్ ఉండటం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు జయభరత్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దోసకు దోమ పోటు


దోమ పోటుతో పగిలిన దోస కాయలు


గిడసబారిన కాయలు

- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఎన్ని మందులు పిచికారి చేసినా.. అదుపులోకి రాని వైనం
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 8: ఆరుగాలం కష్టించే రైతన్నలకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ప్రతి ఏడాది ఎన్నో ఆశలతో పంటలు సాగు చేయడం తీరా పంట చేతికి వచ్చే లోపు నష్టపోవడం షరా మామూలైపోయింది. ప్రకృతి వైపరిత్యాలు, చీడ పీడలు ఆశించడం, తెగుళ్ల సోకడం.. అన్నింటిని అధిగమించి దిగుబడి బాగా వస్తే.. ధరలు లేక పోవడం ఇలా ఏదోక రూపంలో నష్టపోతూనే వున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం దోస పంట సాగు చేసిన రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, ఓబుల వారిపల్లె మండలాల్లో ఈ ఏడాది డిసెంబరు, జనవరి నెలలో సుమారు 5 వేల ఎకరాల్లో దోస పంటను రైతులు సాగు చేశారు. గ్రీన్ మిలాన్, కుందన్, కోహినూర్ అనే రకాల దోస రకాలను రైతులు సాగు చేశారు. పంట సాగుకు ఎరువులు, కూలీలు, కలుపులు, మందుల పిచికారికి ఎకరాకు దాదాపు రూ.లక్ష ఖర్చు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. పంట కూడా ఆశాజనకంగా ఉండటం.. మార్కెట్లో దోస కాయలకు మంచి డిమాండ్ (టన్ను రూ. 16 వేల నుంచి రూ. 17వేలు ధర) ఉండటంతో రైతులు తమ కష్టాలు తీరుతాయని ఎంతో ఆశించారు.

ఆశలపై నీళ్లు చల్లుతూ..

పంట దిగబడి వచ్చే సమయంలో రైతన్నల ఆశలపై నీళ్ల చల్లుతూ.. దోస పంట దోమ పోటుకు గురైంది. దీంతో రైతులు పంటను కాపాడుకునేందుకు ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. ఉద్యానశాఖాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని మందులు పిచికారి చేశారు. అయినా అదుపులోకి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమ పోటు కారణంగా కాయలు పగిలిపోవడం, తీగ అభివృద్ధి చెందకుండా పోయింది. కాయలు కూడా గిడసబారిపోయాయి. దీంతో ఎకరాకు 10 టన్నుల పైగా దిగుబడి రావాల్సి ఉండగా.. 2 నుంచి 3 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో ఎకరాకు రూ.50 వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి దోస కాయలను ముంబాయ్, ఢిల్లీ, రాజస్థాన్, నాగపూర్, భూపాల్, పంజాబ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర నగరాలకు రైతులు ఎగుమతి చేస్తున్నారు. దోమపోటు గురైన కాయలను ఎవరు తీసుకోకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు.


దోమ పోటుతో దెబ్బతిన్న దోస పంట

పెట్టుబడి కూడా రాలేదు



దోస పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాను. పంట బాగుంది కష్టాలు తీరుతాయనే సమయంలో దోమపోటు సోకింది. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పినట్లు మందులు పిచికారి చేశాను. అయితే తిప్స్ దోమలు కంట్రోల్ కాలేదు. దిగుబడి బాగా తగ్గిపోయి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

జి.వెంకటసుబ్బయ్య, రైతు, సింగిరివారిపల్లె, రైల్వేకోడూరు మండలం

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుర్రప్ప, జాన్ కెనడీ ఎన్నిక


ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు

కడప (రూరల్) ఏప్రిల్ 8: కడప న్యాయవాదుల సంఘం 2024-25 పాలకవర్గ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 575 మంది న్యాయవాదులు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా బి.గుర్రప్ప, ప్రధాన కార్యదర్శిగా జాన్‌కెనడీ గెలుపొందారు. అధ్యక్ష స్థానానికి జి.వి.రాఘవరెడ్డి బి.గుర్రప్పలు పోటీ పడగా గుర్రప్ప 16 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి జాన్‌కెనడీ, చంద్రవదనలు పోటీచేయగా వీరిలో జాన్‌కెనడీ 54 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శి(స్పోర్ట్స్, కల్చరల్) స్థానానికి ఎస్.చిన్నయ్య, జె.విజయకుమార్‌లు పోటీ పడగా వీరిలో ఎస్.చిన్నయ్య 70 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక ఉపాధ్యక్ష స్థానానికి పి.చంద్ర మోహన్, కార్యదర్శి-1 స్థానానికి ఎ. రవీంద్రనాద్ రెడ్డి, కోశాధికారి స్థానానికి ఎంవీ సుబ్బరామయ్య, లైబ్రరీ సెక్రటరీ స్థానానికి పి. నాగభూషణంలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి(సీనియర్ న్యాయవాది) పి.జయరామిరెడ్డి తెలిపారు. నూతనంగా ఎంపికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గుర్రప్ప జాన్‌కెనడీ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి శ్రమిస్తామన్నారు.

చిన్నపిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప(రూరల్) ఏప్రిల్ 8: దుకాణాలు, కర్మాగారాలు తదితర ఇతర ప్రదేశాలలో చిన్నపిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎస్.కవిత పేర్కొన్నారు. సోమవారం నిర్బంధిత బాలకార్మికుల రక్షణ, పునరావాస కార్యక్రమాలకు సబంధించి సోమవారం నగరంలోని ఆర్కెఎం స్ట్రీట్, మద్రాస్ రోడ్లలో ఉన్న షాపులలో లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కవిత మాట్లాడుతూ షాపులలో చిన్నపిల్లలతో పనులు చేయించకూడదన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని షాపులలో పనిచేయించుకోవాలన్నారు. ఉచిత న్యాయసహాయం తదితర అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్, లెబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.పాల్ జాన్సన్, ఎస్.ఐ నిర్మలాదేవీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు గడువు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8: కడపమీదుగా రాజస్తాన్‌లోని భగత్‌కీకోటి రైల్వే స్టేషన్ వెళ్లే ప్రత్యేక రైలు గడువును మే 1వతేదీ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. భగత్‌కీకోటి రైల్వేస్టేషన్ నుంచి ఈ నెల 18, 27 తేదీల్లో రైలు (04811) బయల్దేరి ఎర్రగుంట్ల, కడప మీదుగా కోయంబత్తూరుకు వెళ్లనుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో కోయంబత్తూరు నుంచి రైలు (04812) ఈ నెల 22, మే 1 తేదీల్లో బయల్దేరి రాజస్తాన్‌లోని భగత్‌కీకోటికి వెళ్లనుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12న పులివెందులలో షర్మిల బస్సుయాత్ర

వేంపల్లె, ఏప్రిల్ 8: పీసీసీ అధ్యక్షురాలు, ఆ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల 12వ తేదీన పులివెందులలో బస్సుయాత్ర నిర్వహించనున్నారని పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేంపల్లె నుంచి బస్సుయాత్ర ప్రారంభమై వేముల మీదుగా పులివెందులకు మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. భోజనం అనంతరం లింగాలకు అక్కడి నుంచి వెలిదండ్ల, బిదినంచెర్ల మీదుగా సింహాద్రిపురానికి సాయంత్రం పులివెందులకు చేరుకుంటుందని వివరించారు.

సంస్కృతికి ప్రతిరూపం రాష్ట్రగీతం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8: శంకరంబాడి సుందరాచారి రాసిన మన రాష్ట్ర గీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', మన సంస్కృతీ సాంప్రదాయాలకు నిలువెత్తు రూపమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసరు మూలమల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శంకరంబాడీ సుందరాచారి 47వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాఠశాల వేళలు మార్చాలి : ఎస్టీయూ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8 : విద్యార్థులకు ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల పాఠశాలల సమయం మార్పు చేయాలని ఎస్టీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు కోరారు. సోమవారం కడప నగరం ఎస్టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. చాలా చోట్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల సమయం ఉదయం 7 నుంచి 11.30 వరకు మార్పు చేయాలన్నారు.

గొలుసు దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు


వివరాలు తెలుపుతున్న చిన్నచౌకు సీఐ, ఎస్ఐ

కడప (క్రైం), ఏప్రిల్ 8: చిన్నచౌకు పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఓ మహిళ మెడలో నుంచి బంగారుగొలుసు లాక్కుని పారిపోయిన కేసులో నిందితుని అరెస్టు చేసి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం చిన్నచౌకు సీఐ, ఎస్ఐలు సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నగరంలోని భరత్‌నగర్‌కు చెందిన మోడుగుల చంద్రమౌళి అనే వ్యక్తి ఓ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. అయితే డబ్బులు సరిపోకపోవడంతో ఈజీ మనీ కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శ్రీరామ్‌నగర్‌లోని ఓ ఇంటి ముందు కసువు ఊడుస్తున్న మహిళ మెడలో నుంచి 35 గ్రాములు గల బంగారు సరుడును లాక్కుని పరారీ అయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పాత బైపాస్‌రోడ్డులో బ్రహ్మయ్యషెడ్డు వద్ద ముద్దాయి ఉన్నట్లు సమాచారం రావడంతో సీఐ, ఎస్ఐలు సిబ్బందితో వెళ్లి అతన్ని అరెస్టు చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


మల్లయ్య మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 8: స్థానిక పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన మల్లయ్య అలియాప్ మల్లి (34) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు ... మల్లయ్య మిట్టమదివీధిలో బాడుగ ఇంట్లో భార్య ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో భార్య దొరసానిపల్లెలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మల్లయ్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని పవర్‌హౌస్‌రోడ్డులోని సొంత ఇంటికి వచ్చి ఉండేవారు. తన అక్కను ఎందుకు కొట్టావంటూ మల్లయ్య ఇంటికి వెళ్లి అతనితో గొడవకు దిగారు. దీంతో మనస్థాపం చెందిన మల్లయ్య తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న పాలవ్యాను, మృతి చెందిన అన్నమయ్య (ఫైల్)

సంబేపల్లె, ఏప్రిల్ 8: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి నారా యణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో కందుకూరి అన్నమయ్య (20) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లెకు చెందిన అన్నమయ్య అతని తండ్రి రామకృష్ణ గ్రామంలో పాలు సేకరించుకొని ప్రతి రోజు కలకడ దగ్గర ఉన్న జెర్సీ పాల డైరీకి పాలు తరలించే వారు. ఈ క్రమంలో ఆదివారం పాలు తీసుకొని డైరీకి తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు వద్దకు రాగానే ముందువైపు ఉన్న లారీని ఢీకొనడంతో అన్నమయ్య మృతి చెందాడు. అతని తండ్రి రామకృష్ణ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి భయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు అదుపు తప్పి యువకుడు మృతి


ప్రమాద స్థలంలో సరేష్ మృతదేహం

ముద్దనూరు ఏప్రిల్ 8: మండల పరిధి పులివెందుల రహదారిలోని నల్లబల్లె గ్రామం పుల్లేరు వంక సమీపంలో సోమవారం బైకు ప్రమాదంలో సురేష్(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లెకు సురేష్ పులివెందులలోని హిందూ ట్రావెల్స్ పనిచేస్తున్నాడు. పులివెందుల నుంచి స్వగ్రామానికి బైకులో వెళుతూ బైకు అదుపు తప్పి పొలంలో పాతిన దిమ్మెకు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాసులు సంఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదస్థలాన్ని పరిశీలించారు.

వాహనాల తనిఖీలో లక్ష రూపాయలు సీజ్

పుల్లంపేట, ఏప్రిల్ 8: మండల పరిధిలోని పుత్తనవారిపల్లె చెక్‌పోస్టు వద్ద సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీలో లక్ష రూపాయల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. ఓబులవారిపల్లె మండలం అయ్యలరాజుపల్లెకు చెందిన సూర్య ప్రకాష్‌రెడ్డి మోటారు బైకుపై లక్ష రూపాయలు తీసుకెళుతుండగా.. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం సురక్షితం


వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 8 : ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం పూర్తిగా సురక్షితమైన మార్గమని, ఎటువంటి మానసిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు 24/7 గంటలు 365 రోజుల్లో ఎప్పుడైనా ఎక్కడి నుంచి అయినా సెలవు దినాల్లో అయినా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. సోమవారం ఆయన విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రానికి వెళ్లి అక్కడ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు విద్యుత్ వసూలు కేంద్రాల వద్దకు వెళ్లి క్యూలో నిలబడాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి వయ ప్రయాసలకు గురికాకుండా.. మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా సురక్షిత ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మొబైల్‌ఫోను నుండే బిల్లులు చెల్లించుకునే సౌలభ్యం ఉందన్నారు. దాదాపు 80 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించిన బిల్లులకు రశీదులు పొందవచ్చని, అంతేకాకుండా గతంలో మనం చెల్లించిన బిల్లుల రశీదుల వివరాలు కూడా చూసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే రశీదు, కార్యాలయం వద్ద చేతితో ఇచ్చే రశీదు రెండూ సమానమేనని.. అందులో సందేహం లేదన్నారు. ఏమైనా అపోహలు ఉంటే దగ్గరలోని విద్యుత్ రెవెన్యూ ఆఫీసుల వద్దకు వెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అలాగే మీ విద్యుత్ సర్వీసులకు మీ మొబైల్ నెంబరును తప్పనిసరిగా లింకు చేసుకుంటే సమాచారం మీకు అందుతుందన్నారు.

నిందితులను తప్పిస్తే సహించేది లేదు : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 8: భూ వివాదంతో హత్యకు గురైన ఆదిమూలం శ్రీనివాసులు హత్య కేసులో ప్రధాన నిందితులైన చిన్నపుల్లారెడ్డి, నాగ పుల్లారెడ్డిని తప్పించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కా ర్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు హెచ్చరించారు. వారి తో పాటు సంబంధిత మండలం ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, అప్పటి తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజును కూడా నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం చిన్న సుబ్బరాయుడుకు చెందిన భూమి విషయమై వివాదం నడుస్తోందన్నారు. ఆ సమస్యను పరిష్కరించాలని చాలా ఏళ్లుగా ఇటు రెవెన్యూ, అటు పోలీసు అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేదన్నారు. భూ వివాదాన్ని పరిష్క రించాలన్నారు. చిన్నపుల్లారెడ్డి, నాగ పుల్లారెడ్డి వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వల్ల ప్రాణహాని ఉందని, దీంతో చిన్నసుబ్బరాయుడు కలెక్టర్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందికపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారని, అలాగే చిన్నపుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, కడప నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నాయకులు చంద్రశేఖర్, గంగాసురేష్, వలరాజు, భాగ్యలక్ష్మి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సామాన్యులకు రక్షణ లేదు : బీజేపీ


మాట్లాడుతున్న బాలకృష్ణయాదవ్

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో సామాన్యులకు రక్షణే లేకుం డా పోయిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. సో మవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఈనెల 2వ తేదీన పెండ్లిమర్రి మండలం యాదవాపురం గ్రామానికి చెం దిన ఆదిమూలం శ్రీనివాసులు అనే యువకుడిని ఆయన సొంత భూమిలో పనిచేసుకుం టూ ఉండగా అదే గ్రామానికే చెందిన పెద్దిరెడ్డిగారి చిన్న పుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డి అనుచరులు హత్య చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై సంబంధిత మం డల ఎస్ఐ, అలాగే అప్పటి తహసీల్దార్‌ను కూడా నిందితులుగా చేర్చి శిక్ష పడేలా చేయాలన్నారు. లేదంటే ఈ హత్యను ఢిల్లీ స్థాయికి తీసుకెళతామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో హత్యకు గురైన శ్రీనివాసులు తండ్రి చిన్నసుబ్బరాయుడు, అఖిల భా రత యాదవ మహా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

ముద్దనూరు ఏప్రిల్ 8: భూపేశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించేందుకు జమ్మలమడుగు నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చేలా ఎన్డీయే కూటమి నాయకులు, కార్యర్తలు కృషి చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ఉమ్మిశెట్టి ఫంక్షన్ హాలులోసోమవారం టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి ప్రసంగించారు. దేవగుడి కుటుంబంలో తాను, భూపేశ్ పోటీలో ఉన్నామని, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీ ఓట్లు సాధించేలా కృషి చేయాలన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు అదనంగా మరో రెండు లక్షలు కలిపి రూ.12 లక్షలు ఇప్పిస్తామన్నారు. కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నిల్లో ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరుపున తాను పోటీలో ఉన్నానని, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ తరుపున ఆదినారాయణరెడ్డి పోటీలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు చింతాశివరామిరెడ్డి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఖాదర్ ఖాన్, బాబాఅమీర్, రామాంజనేయరెడ్డి(బాబు), కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్‌నాయుడు,రామసుబ్బారెడ్డి,బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి,అప్పర్ల, గోపాలకృష్ణ,తులశయ్య టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు , నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో ఉత్సవాలు

కడప (కల్చరల్) ఏప్రిల్ 8: ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురష్కరించుకుని నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఈనెల 9, 11, 17, తేదీలలో సంప్రదాయ ఉత్సవాల కార్యక్రమం తలపెట్టినట్లు సంబంధిత పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు 9వ తేదీ మంగళవారం సాయంత్ర ం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జానపద, సినీ, కూచిపూడి, నృత్యాలు వుంటాయన్నారు. ఈనెల 11న రంజాన్, 17న శ్రీరామనవమి రోజు కూడా సాయంత్రం 6 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పలువురిని కలిసిన డాక్టర్ వైఎస్ సునీత

పులివెందుల, ఏప్రిల్ 8: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత సోమవారం పలువురిని కలిశారు. మదూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి కుమారుడు ఎం.వినయ్‌రెడ్డిని, రమణారెడ్డి కుమారుడైన మురళీధర్‌రెడ్డిని, ఖాజీపేటకు చెందిన గోవిందరెడ్డిని, డీఎల్ రవీంద్రారెడ్డిని, రాజుపాలెంకు చెందిన వెంకటరామిరెడ్డిని సునీత కలిసి మాట్లాడారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఆరా తీయగా వారితో మాట్లాడినట్లు ఆమె ధృవీకరించారు.

వైసీపీకి అప్జల్‌ఖాన్ రాజీనామా

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8 : వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి వైసీపీ సీనియర్‌నాయకులు టీకే అప్జల్‌ఖాన్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా పంపించారు. కడప ఎమ్మెల్యే సీటు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని.. ఈనేపథ్యంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో స్పష్టం చేసినట్లు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 8: అక్కలరెడ్డి పల్లెలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. ట్రాక్టర్ల చిన్నదస్తగిరి అనే రైతు పశువుల కోసం వేసుకున్న గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో కాలిపోయి బూడిదగా మారింది. దాదాపు రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

31 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం - ఐదుగురు నిందితుల అరెస్టు

ములకలచెరువు, ఏప్రిల్ 8: ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఎస్ఈబీ అధికారులు, పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి రూ.2లక్షలు విలువ చేసే 31 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి ఒక కారు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువు మండలం గూడుపల్లె క్రాస్ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న కారును తనిఖీ చేసి తంబళ్ళపల్లె మండలం కమ్మవారిపల్లెకు చెందిన ప్రతాప్(29), గణేష్(24), కొత్తపల్లెకు చెందిన వెంటరమణా రెడ్డి(65)లను అరెస్టు చేశామన్నారు. అలాగే పెద్దతిప్పసముద్రం మండలం కమ్మచెరువు వద్ద దాడులు నిర్వహించి ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆనంద్ అలియాస్ శ్రీరాములు(38), శ్రీ సత్యసాయి జిల్లా బొంతలపల్లెకు చెందిన వెంకటరమణ(43)లను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో కారు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో సీఐ మధు, ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబు, శివకుమార్‌లు పాల్గొన్నారు.

మహిళ అరెస్టు.. 20లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 8: నాటుసారా విక్రయిస్తున్న ఈశ్వరమ్మ(40)అనవ మహిళను అరెస్టు చేసి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి పంచాయతి నాగులమ్మగారిపల్లికి చెందిన ఈశ్వరమ్మ గ్రామంలో నాటుసారా విక్రయిస్తుండగా తన సిబ్బందితో దాడి చేసి ఆమె వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.







ఉగాది సంబరం.. ఆరంభం



జనంతో కిటకిటలాడుతున్న మదనపల్లె మార్కెట్



పీలేరులో పూలు, నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 8: 'క్రోధి' నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగ సంబరాలు ఆరంభమయ్యాయి. పల్లెలు, పట్టణాల్లో ఉగాది పండుగను మంగళవారం ఆనందంగా జరుపుకోనున్నారు. ఇందు కోసం సోమవారం సాయంత్రం నుంచే పండుగ సామగ్రి కొనుగోళ్లతో పట్టణాలు, పల్లెలు జనాలతో రద్దీగా మారాయి. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ వద్దగల పూల అంగళ్లు జనంతో కిటకిటలాడాయి. పండుగ సందర్భంగా పూల కొనుగోళ్లకు డిమాండ్ కావడంతో అధిక ధరలు పలికాయి, చెండుమల్లెపూలు కేజీ వంద నుంచి వందయాభై వరకు, చామంతులు కేజీ నాలుగు వందల నుంచి ఐదు వందల వరకు ధరలు పలికాయి. కనకాంబరాలు ఏకంగా కేజీ 7వందల నుంచి 8వందల వరకు ధర పలికాయి. విపరీతమైన పూలధరలు ఉండడంతో కొనుగోలు దారులు ఆచి తూచి కొనుగోలు చేశారు. పూల సప్లయ్ తగ్గడంతో వెంటవెంటనే రెండు పండుగలు హిందువులకు ఉగాది, ముస్లింలకు రంజాన్ పండగలు రావడంతో పూలధరలు అధికంగా అమ్ముడు పోయాయి. పట్టణ పోలీసులు బెంగ ళూరు బస్టాండ్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు.

పీలేరులో: పీలేరు పట్టణంలో పండుగల సందడి నెలకొంది. అటు ఉగాది తెలుగు సంవత్సరాది పర్వదినం, ఇటు పవిత్ర రమజాన్ మాసం ముగింపు సందడి కావడంతో నిత్యావసర సరుకులు, పూజాసామగ్రి, కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు . పూల అంగళ్లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. సోమవారం సాయంత్రం ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం కిటకిటలాడాయి. ఉగాది సందర్భంగా తమ పూర్వీకులకు బట్టలు పెట్టుకునే సంప్రదాయం ఉండడంతో బయటి ప్రాంతాల్లో ఉన్న చాలా మంది తమ సొంతూళ్లకు పయనం కావడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది.

ఆక్రమణల తొలగింపు

పీలేరు, ఏప్రిల్ 8: పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీలోని సర్వే నెం.760లో కొంత మంది చేపట్టిన అక్రమ కట్టడాలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నట్లు సమాచారంతో తహసీల్దారు మహబూబ్‌బాషా సిబ్బందితో అక్కడికెళ్లి వాటిని పరిశీలించి వాటిని కూల్చివేశారు.

వివాదస్థలంలో అక్రమ నిర్మాణాలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 8: మదనపల్లె మండలం కోళ్లబైలు పంచా యతీ పరిధిలోని సర్వేనెంబర్లు 617/2,4, 520 పార్టు స్థలం వివాదంలో ఉన్నా కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని భగత్‌సింగ్ చేనేత కార్మిక సేవా సంఘం అధ్యక్షుడు మురళి జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె పర్యటనకు వచ్చిన జేసీకి వినతి పత్రం ఇచ్చిన మురళి మాట్లాడుతూ చేనేత కార్మికులకు కేటా యించిన ఇళ్ల స్థలాలను హర్షవర్ధనమ్మ అనే మహిళ బోగస్ పత్రాలతో సమస్యలు వచ్చాయని హైకోర్టుకు వెళ్లడంతో ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడాదని జూన్ 5, 2023లో ఉత్తర్వులు వచ్చాయ న్నారు. ఆ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి అడ్డుకున్నా కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. దీనిపై జేసీ మాట్లాడుతూ తహసీల్దార్ రమాదేవి సిబ్బంతో వెళ్లి విచారించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.





టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

కలికిరి, ఏప్రిల్ 8: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై సోమవారం ఆ పార్టీ నాయకులు కలికిరిలో విస్తృత ప్రచారం నిర్వహిం చారు. ఉగాది పండుగ ముందు రోజు కిక్కిరిసిన వారపు సంతలో పసుపు టోపీలు ధరించి వినూత్నంగా ప్రచారం చేశారు. అంతకు ముందు కాలేజీరోడ్డు, ఎల్లమ్మ ఆలయం, నల్లారి కాలనీ, సంత వీధి, కలికిరి మొరవ, బజారువీధి, మసీదువీధి, టీబీ రోడ్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచు ప్రతాప్‌కు మార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు రమేష్ చెట్టి, రెడ్డెప్ప రెడ్డి, జ్ఞానమూర్తి, మేస్త్రీలు రాజన్న, చంద్ర, వెంకట్రమణ, వర్మ, ఏసురాజు, భాస్కర, రమణ, రాజా రెడ్డి, అక్బర్, అఫ్రోజ్, మేస్త్రీ ఎల్లప్ప, రాంబాబు, ఉమాపతి పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరించాలి

కలకడ, ఏప్రిల్ 8:కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం కలకడలోని నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం అన్ని విధాలా ఆలోచించి రాష్ట్రంలో కూటమిలో భాగస్వామి అయిందన్నారు. ఇందుకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహదేవనాయుడు, రామాంజులు, టి.మూర్తి, అంజినేయులు, శ్రీనివాస్, శ్రీనివాసులరెడ్డి, చెన్నమనాయుడు, వెంకట్రాది, మల్లికార్జున్, రెడ్డిముని పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేయండి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 8 : మండలంలోని కందుకూరు గ్రామంలో గల సప్తగిరి గ్రామీణా బ్యాంక్ పరిధిలో రైతులు తీసుకున్న పంట రుణాలకు వడ్డీ మాత్రం కట్టించుకుని రెన్యువల్ చేయాలని బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తీవ్ర వర్షాబావ పరిస్థితుల దృష్ట్యా తీవ్రంగా నష్ట పోయామన్నారు. ఇందులో భాగంగానే పలు బ్యాంక్‌లు రుణాల మీద వడ్డీని మాత్రం చెల్లించి లోన్‌లను రెన్యువల్ చేస్తున్నందున తమకు కూడా ఈ వెసులుబాటు కల్పించాలని కోరారు.

'గ్యాప్'తో ప్రయోజనం

పీలేరు, ఏప్రిల్ 8: గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్(గ్యాప్) సర్టిఫికేట్ల సాధన ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనమని జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రా నాయక్ తెలిపారు. పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ మద్దెలచెరువు పాళెం గ్రామంలో సోమవారం జరిగిన పొలం బడిలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ, మామిడి పంటల్లో గ్యాప్ సర్టిఫికేట్లు సాధించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను కేవలం స్థానిక మార్కెట్‌లలోనే కాకుండా రాష్ట్రంలోని ఏ ప్రాంతాల్లోనైనా అమ్ముకోవచ్చ న్నారు. కార్యక్రమంలో ఏడీ రమణరావు, డీఆర్‌సీఏవో సుచిత్ర, ఏవో ,పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

కురబలకోట, ఏప్రిల్ 8: నైపుణ్యాలు ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగవకాశాలను సాధించవచ్చని సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణా నిపుణుడు ప్రత్యూషా సుబ్బారావు పేర్కొన్నారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెదటి సంవత్సర విద్యార్థులకు రే ప్రోగ్రామింగ్ ఆఫ్‌మైండ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలను ప్రదర్శించి విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, చంద్రమోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిదే విజయం

● మాజీ సీఎం, రాజంపేట కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 8:రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని మాజీ సీఎం, రాజంపేట పార్లమెం టు బీజేపీ. జనసేన, టీడీపీ కూట మి ఉమ్మడి బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గుర్రంకొండ పట్టణంలోని బజారువీధిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సోమవారం సాయంత్రం ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందా లంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలన్నారు. వైసీపీ రాక్షస పాలనతో ఐదేళ్ల రాష్ట్రంలో అభివృద్ధి పాతాళానికి పడిపోయిందన్నారు. జగన్ అనే వ్యక్తి సొంత కుటుంబాన్నే నాశ నం చేశాడని అలాంటి వ్యక్తికి మరో అవకాశమిస్తే పేద ప్రజలు బతకడం కష్టమేన న్నారు. పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు ఎక్కడా జరగలే దన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీ గెలిపించడానికి నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మల్లారపు రవిప్రకాశ్ నాయుడు, నాయకులు ఇంతియాజ్ అహ్మద్, నౌషాద్ అహ్మద్, ఏజాజ్ అహ్మద్, జగదీష్‌కుమార్, నక్కా సతీష్, నక్కా బాలాజి తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా పండుగలు చేసుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 8: కుల,మతాలకు అతీతంగా పండుగలు చేసుకోవాలని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక సీటీఎం రోడ్డులో నాదెళ్ల రమేశ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లెలో హిందువులు, ముస్లింలు ఐకమత్యంగా వుంటూ ఇరు మతాలను గౌర వించడం సాంప్రదాయంగా వస్తోందన్నారు. ఉగాది, రంజాన్ పండుగలను హిందూ, ముస్లింలు కలసి నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రనాయుడు, హెరిటేజ్ రమేశ్, సతీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌లను ఇళ్ల వద్దనే పంపిణీ చేయండి



ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, ఏప్రిల్ 8:వివిధ సామాజిక పెన్షన్‌లను వచ్చే నెల నుంచి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమారోరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి పాలెంమూల, ఇర్రివాండ్లపల్లె, నాయినివారిపల్లె, బాలయ్యగారిపల్లె, ఆర్వెంటదిన్నె గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను అందజేసి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు పెన్షన్‌లు పంపిణీ చేయకుండా తమ పార్టీ ఎక్కడా అభ్యంతరం చెప్పలేదన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాశ్; పొత్తూరి ప్రభాకర్ నాయుడు, బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతినాయుడు, కాంతారావు, మల్లికార్జుననాయుడు, స్వామి, విశ్వనాథ్, రమణ, ఈశ్వరయ్య, రవీంద్రరెడ్డి, కోటి, సురేంద్రరెడ్డి, తారకేశ్వర, ప్రసాద్, రమణ, రెడ్డెప్ప, ఆనందరెడ్డి, నౌషాద్ పాల్గొన్నారు.

ఓర్వలేకే తంబళ్లపల్లె అభ్యర్థిత్వంపై అసత్య ప్రచారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్

ములకలచెరువు, ఏప్రిల్ 8: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పని కట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ములకలచెరువు, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల పార్టీ అధ్యక్షులు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్రయాద్, ఆనందరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డిలతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్ 'పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయచంద్రారెడ్డికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడంతో వైసీపీ కుట్రలకు తెరలేపిందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి మార్పు అనేది ఎట్టి పరిస్థితిలో జరగదన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతలు సాయినాథ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, పెద్దమండ్యం మండల మాజీ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిస్టా, నాయీ బ్రాహ్మణ సెల్ జిల్లా అధ్యక్షుడు కేశవులు, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా

నిమ్మనపల్లి, ఏప్రిల్ 8: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముష్టూరు పంచాయతిలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాని నూకలు చెల్లాయని ప్రజల నుంచి టీడీపీకి వస్తున్న స్పందన చూస్తే అది నిరూపితమైందని అన్నారు. టీడీపీ ప్రవేశపెడుతున్న సూపర్‌సిక్స్ పథకాలలో వృద్ధ్యాప్య పించను రూ.4వేలు ఇస్తామని తెలిపారు. ఎన్ని కల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్రక్రమంలో మహేష్, ప్రదీప్, ఆర్టీవెంకటటేష్, రాజన్న, నవీన్, శ్రీపతి, శ్రీనివాసులు, మల్లికార్జున, మహమద్ రఫి, మధుబాబు, శ్రీరాములు, మల్లప్ప, రెడ్డెప్ప, జయన్న, చంద్రశేఖర్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్దపీట

రామసముద్రం, ఏప్రిల్ 1: టీడీపీ హ యాంలోనే బీసీలకు పెద్దపీట వేసిన ట్లు మదనపల్లె టీడీపీ, జనసేన, బీజే పీ కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్ బాషా పేర్కొన్నారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెపంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో మండల పార్టీ అధ్య క్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జయహో బీసీ సద స్సులో షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఐదేళ్లలో పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేట్‌లకు ఆర్థిక నిధులు విడుదల చేయకుండా నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మునివెంక టస్వామి, శివశంకర్, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, రెడ్డిశేఖర్, కృష్ణంరాజు, నాయకులు శ్రీనివాస్‌గౌడు, బద్రినాథ్‌శెట్టి, చెంగారెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చంద్ర, విశ్వనాథ్, సనాఉల్లా, కిట్టా, వేణుగోపాల్, సీనప్ప నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేని పాలన అందిస్తా..

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 8: మదనపల్లె పట్టణ శివారులోని ప్రాంతాల్లో ప్రజలకు సమస్యలు లేని పాలన అందిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్ బాషా హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని మూడో వార్డులో రామారావు కాలని, గౌతమి నగర్ ప్రాంతాల్లో షాజహాన్‌బాషా ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు, మురుగునీటి కాలువలు తదితర మౌలిక వసతులు కల్పించలేదని ప్రజలు షాజహాన్‌బాషా దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కురబసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డిప్రసాద్, టీడీపీ నాయకులు కమలామర్రి కృష్ణ, దేవారమేశ్, శ్రీనివాసులు, రామ్మూర్తి నాయుడు, రామకృష్ణ, వెంకట్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోయకొండ గంగమ్మ తిరుణాల

పీలేరు, ఏప్రిల్ 8: పీలేరు మండలం రాయలవారిపల్లెలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో తిరుణాల నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చలపతి తెలిపారు. అమ్మవారికి మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకం, రాత్రి 7 గంటలకు కోలాటాలు, చెక్కభజనలు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం అమ్మవారికి పుష్పపల్లకి ఊరేగింపు, పొంగళ్లు ఉంటాయని తెలిపారు.

ఇంటింటి ప్రచారానికి ముందస్తుగా సమాచారమివ్వాలి

● రాజకీయ పార్టీలకు ఎస్పీ మణికంఠ సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ఇంటింటి ప్రచారం కోసం ముందస్తుగా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని రాజకీయ పార్టీలకు ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికలకు సంబంధించిన వివిధ అధికారులతో క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన బాధ్యతలపై కలెక్టర్ షన్మోహన్‌తో కలిసి సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా ఉపయోగించరాదన్నారు. వాహనాల తనిఖీ సమయంలో దొరికిన నగదు, మద్యం, ఇతర వస్తువులకు సరైన ఆధారాలు లేకుంటే వాటిని సీజ్ చేసేటప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో 18వ తేదీ నుంచి అదనంగా సిబ్బందిని నియమిస్తామని వివరించారు. ఆ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరా, వీడియో కవరేజ్, వెబ్‌కాస్టింగ్ ఉంటుందన్నారు. వీటికి సంబంధించిన లింక్ కలెక్టర్, ఎస్పీకి ఉంటుందని చెప్పారు. అనుమతిచ్చిన వాహనాలను ఇతర బృందాల అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ షన్మోహన్ చెప్పారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమౌతున్న దృష్ట్యా అన్నిరకాల బృందాలు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. వాహన తనిఖీల్లో రూ.50వేలకు మించి నగదు ఉంటే, వాటికి సరైన ఆధారాలుంటే విడిచిపెట్టాలన్నారు. ఒకవేళ సరైన ఆధారాలు లేకుండా అనుమానిత నగదు ఉంటే, వాటిని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు పంపాలన్నారు. పోస్టాఫీసులు, బ్యాంకుల నుంచి నగదును ఇతర పోస్టాఫీసులు, బ్యాంకులకు తరలిస్తుంటే ఆయా రిటర్నింగ్ అధికారులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, వివిధ బృందాల అధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


ఎస్పీతో కలిసి ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ఎన్నికలయ్యే వరకు బాధ్యతతో పనిచేయాలి

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్నిరకాల బృందాలు, నోడల్ అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ షన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీతో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగ ఓటర్లకోసం వీల్‌చైర్‌ను ఉంచాలన్నారు. త్వరలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు, సెక్టోరల్ అధికారులు, పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ తీసుకుని వెళ్లేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంచేయాలని రవాణాశాఖ నోడల్ అధికారిని ఆదేశించారు. ఏ రోజుకు ఆరోజు నివేదికలను సంబంధిత రిటర్నింగ్ అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ, డీఆర్వోతో పాటు నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎలక్షన్ కంట్రోల్ రూమ్ పరిశీలన

కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 24గంటలూ పనిచేసేలా ఏర్పాటు చేసిన ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య తనిఖీ చేశారు. కంప్యూటర్ సిస్టమ్స్ పనితీరు గూర్చి అడిగి తెలుసుకున్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్ల రద్దు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ అయినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రవిరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో అన్ని క్యాడర్లలో డిప్యుటేషన్, వర్క్ ఆర్డర్లపై పనిచేస్తున్న వారిని వెంటనే వారి స్థానాల్లో చేరాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ వైద్యాధికారులు, డీడీవోలు ఇంప్లిమెంట్ చేయాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులెవరైనా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బియ్యం పంపిణీకి సర్వర్ సమస్య

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: నిత్యావసర వస్తువుల పంపిణీకి సర్వర్ సమస్య పీడిస్తోంది. ఏప్రిల్ నెల కోటా పంపిణీ గత సోమవారం నుంచి ప్రారంభమైంది. సాంకేతిక సమస్యల కారణంగా జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా సర్వర్ పనిచేయకపోవడంతో ఎండీయూ వాహనాల వద్ద కార్డుదారులు ఎండల్లో అవస్థలు పడ్డారు. సర్వర్‌పై ఒత్తిడి పెరుగుతుండడంతో బియ్యం పంపిణీ మందకొడిగా సాగుతోంది. రద్దీగా ఉన్న సందర్భాల్లో మరికొన్ని గంటలు నిరీక్షిస్తున్నారు. మొత్తం 5.43 లక్షల మంది కార్డుదారులుండగా సోమవారం నాటికి 3.48 లక్షల కార్డులకు బియ్యం, చక్కెర, రాగిపిండి (64.17 శాతం) పంపిణీ జరిగింది. పోర్టబిలిటీ ద్వారా 63,244 కార్డుదారులు నిత్యావసర వస్తువులు పొందారు.


పైపల్లెలో సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్న కార్డుదారులు

బండపల్లిలో పోలీసుల దాడులు

● 400 లీటర్ల సారా ఊట ధ్వంసం

గుడిపాల, ఏప్రిల్ 8: గుడిపాల మండలం బండపల్లి గ్రామ చివరలో సోమవారం సారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తి గురించి ఆరాతీస్తున్నారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు చేపట్టినా తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ఆదేశించారు.


సారా తయారీకి వినియోగించిన సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మేమెందుకు రాజీనామా చేయాలి..!?

● చంద్రగిరిలో వైసీపీ నాయకులు, అధికారులపై తిరగబడిన వలంటీర్లు

చంద్రగిరి, ఏప్రిల్ 8: మేము ఎందుకు రాజీనామా చేయాలంటూ చిత్తూరు జిల్లా చంద్రగిరిలో గ్రామ వలంటీర్లు తిరగబడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామ వలంటీర్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు తమ విధులలో, రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే చంద్రగిరి మండలంలో వైసీపీ నాయకులు రోజుకు ఐదుగురు చొప్పున వలంటీర్లు రాజీనామా చేయాలంటూ తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం వలంటీర్లను మండల ఉన్నతాధికారుల వద్దకు వీరు తీసుకెళ్లారు. అధికారులు కూడా తమ విధులకు రాజీనామా చేయాలంటూ ఆదేశించినట్లు సమాచారం. అయితే తామెందుకు రాజీనామా చేయాలని కొందరు వలంటీర్లు ఎదురు తిరగడంతో అధికారులు కంగుతిన్నారు. కాగా, తాము వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనేందుకు నాయకులు బెదిరించి రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తున్నట్లు వలంటీర్లు చెబుతున్నారు. తాము రాజీనామా చేసి వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనాలని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటసూర్యసాయిని వివరణ కోరగా.. వలంటీర్లను రాజీనామా చేయమని ఎవరూ చెప్పలేదన్నారు. ఎన్నికలలో రాజకీయ పార్టీలలో పాల్గొనకూడదని మాత్రమే చెప్పినట్లు తెలిపారు. ఎవరైనా అధికారులు రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని వలంటీర్లకు సూచించినట్లు పేర్కొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీరు తొలగింపు

వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ వలంటీర్ శ్రీకాంత్ తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా, ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు.

15నుంచి వస్త్రాల ఈ-వేలం

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు టీటీడీ ఈ-వేలం వేయనుంది. కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 335(23541-23552) లాట్లు ఉన్నాయి. ఇందులో ఆర్ట్ సిల్క్ ధోతీలు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, దుపట్టాలు, శాలువలు, బెడ్ షీట్లు, నాప్‌కిన్స్, హ్యాండ్ కర్ఛీఫ్‌లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాణాలు, కార్పెట్లు ఉన్నాయి. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429, టీటీడీతిరుమల.ఓఆర్జీ, కొనుగోళ్లు.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను సంప్రదించవచ్చని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

నకిలీ రైల్వే పోలీస్ అరెస్ట్

నాగలాపురం, ఏప్రిల్ 8: నకిలీ రైల్వే పోలీసును స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారం రోజులు మునుపు ఓ వ్యక్తి ఆర్‌పీఎఫ్ పోలీస్‌నంటూ నాగలాపురంలోని పలు ఇంటర్‌నెట్ కేంద్రాల నుంచి డబ్బుల వసూలుకు యత్నించాడు. దీనిపై గత శనివారం రైల్వే పోలీస్ పేరుతో డబ్బులు డిమాండ్ అన్న కథనం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైంది. ఎస్‌ఐ ఓబయ్య విచారణ చేపట్టారు. నకిలీ రైల్వే పోలీసులా వ్యవహరించిన పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన వినురాజును అరెస్టు చేశారు. కాగా రైల్వే పోలీసుల సాయంతోనే నిందితుడు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. ఈ నకిలీ పోలీస్‌ని కేసు నుంచి తప్పించేందుకు మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నేత పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

వేడుకగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం వేడుకగా జరిగింది. అమావాస్య తిథి విశేషాన్ని పురస్కరించుకొని ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ వ్యవహారంపై 12న విచారణ

● రికార్డులు మాయం కావడంపై ఉన్నతాధికారుల సీరియస్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8: చిత్తూరు జిల్లా పరిషత్తులో జరుగుతున్న వ్యవహారాలు రోజురోజుకూ తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. గతంలో ఇక్కడ సీఈవోగా పనిచేసి ఇటీవల వేరే శాఖకు బదిలీ అయిన ప్రభాకర్‌రెడ్డి హయాంలో జరిగిన అక్రమాల గురించి ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై విచారణకు జేసీ శ్రీనివాసులును విచారణాధికారిగా కలెక్టర్ షన్మోహన్ నియమించారు. విచారణ సమయంలో అవసరమైన రికార్డులను మాజీ సీఈవోకు నమ్మిన వ్యక్తిగా ఉన్న జడ్పీలోని ఓ అధికారి మాయం చేసినట్లు తెలిసింది. అతడూ విధులకు హాజరు కావడంలేదని సమాచారం. దీంతో ఆదివారం జరగాల్సిన జేసీ విచారణ వాయిదా పడింది. ఈ విషయంగా కలెక్టర్, జేసీ ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో ఆ అధికారి మళ్లీ ప్రత్యక్షమయ్యారు. తాను సెలవులో ఉన్నట్లు పాత తేదీతో లీవ్ లెటర్‌ను అందించేందుకు ప్రయత్నించారు. ఈ విషయంగా ప్రస్తుత జడ్పీ ఉన్నతాధికారి ఆగ్రహించినట్లు సమాచారం. ఆదివారం జరగాల్సిన విచారణ 12వ తేదీన ఉంటుందని తెలుస్తోంది. జేసీ ఆధ్వర్యంలో ఆ రోజు జరిగే విచారణకు అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచాలని మాజీ సీఈవోకు నమ్మిన వ్యక్తికి ప్రస్తుత ఉన్నతాధికారి ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని గమనిస్తున్న జడ్పీ ఉద్యోగులు తమపై ఎక్కడ వేటు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చుల్లో అక్రమాలు

● జడ్పీ మాజీ సీఈవోపై విచారించండి

జిల్లాలో 2022లో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఖర్చుల్లో అప్పటి సీఈవో ప్రభాకర్‌రెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు టీడీపీ నాయకులు, జడ్పీ గురించి అవగాహన ఉన్న బయటి వ్యక్తులు కొందరు కలిసి పంచాయతీరాజ్ కమిషనర్‌తో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. గత నెలలో చేసిన ఫిర్యాదు గురించి తాజాగా బయటికి పొక్కింది. 'స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.8 కోట్లను అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధుల్ని మాజీ సీఈవో తన ఖాతాలో వేసుకున్నారు. రూ.8 కోట్లకు బ్యాంకు ద్వారా వచ్చిన వడ్డీని కూడా లెక్క చూపలేదు. ఎన్నికల నిర్వహణా ఖర్చులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా లేవని 2023లో ఆర్థిక శాఖ షోకాజ్ జారీ చేసింది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. ఎన్నికలు జరగకుండానే నిర్వహణా నిధుల్ని స్వాహా చేశారని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు.

కోడ్ ఉంది గురువా!

● మంత్రి రోజా భర్తతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు

నగరి, ఏప్రిల్ 8: నగరి పట్టణ పరిధిలోని కీలపట్టులో సోమవారం మంత్రి రోజా భర్త ఆర్కే సెల్వమణి వైసీపీ తరుపున చేపట్టిన ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు. 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన వారికి ఇటీవల ఉద్యోగాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా టీచర్ పోస్టు సంపాదించిన ఆయన వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు.


వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్గొన్న దృశ్యం

టీటీడీ జేఈవోగా గౌతమి



తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి నియమితులయ్యారు. ఈమేరకు ఈమెను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో గౌతమిని నియమించారు. గౌతమి.. 2007-09 వరకు చిత్తూరు జిల్లాలో ప్రొబేషనరీ అధికారిగా, 2012 వరకు అనంతపురం ఆర్డీవోగా, 2015 వరకు నెల్లూరు డ్వామా పీడీగా, 2019 వరకు టీటీడీ డిప్యూటీ ఈవోగా, 2022 వరకు కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 2023 వరకు తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవోగా, ఆ తర్వాత అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు టీడీపీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8: సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విభజన అనంతరం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నపటికీ నవ్యాంధ్ర సీఎంగా నారా చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. వీటితోపాటు రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులనూ చేపట్టిన సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు నాయుడని అని కొనియాడారు. వైసీపీ పాలనలో అభివృద్ధి పరంగా ఎక్కడా ఒక్క ఇటుక కూడా వేయలేదని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. చంద్రబాబు ముందుచూపుతో రాష్ట్రానికి అనేక అంతర్జాతీయ పరిశ్రమలు వచ్చాయని, వీటితో లక్షలాది మందికి ఉపాధి లభించిందని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కొత్తపరిశ్రమలు రాకపోగా ఉన్నవి మూతపడ్డాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు చంద్రబాబుకు మాత్రమే సాధ్యమన్నారు. సంపద సృష్టించడంలో, ఆదాయ వనరులను పెంచుకోవడంలో ఆయన సమర్థుడని కొనియాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేలు పింఛన్ ఇవ్వడంతో పాటు ఇసుక ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు టీడీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగల శక్తి ఒక్క చంద్రబాబుకే ఉందని అన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నేతలు దొరబాబు, సురేంద్రకుమార్, కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఇఫ్తార్ విందులో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల



బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండలంలోని జామియా మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి దువా చేశారు. ముస్లింల అభ్యున్నతి పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని దగ్గుమళ్ల అన్నారు. రంజాన్ తోఫా, ఇమాంలు, మౌజన్‌లకు వేతనాలు ఇవ్వడంతో పాటు హజ్ యాత్రకు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. నాయకులు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్‌రెడ్డి, ఎన్‌పీ ధరణి, ఎన్‌పీ విక్రమ్, హేమచంద్ర నాయుడు, లోకనాథ నాయుడు, జనార్దన్‌గౌడ్, ముస్లిం మైనార్టీ కార్యదర్శి రహంతుల్లా ఖాన్, ముత్తావళి జాకీర్ హుస్సేన్, ఆరీఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి తిరుమల ముస్తాబు

● నేడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఆలయంలోని బంగారు వాకిలిలో పండితులు ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగాసుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్, పుష్పాలంకరణలో ఆలయం ప్రత్యేక అందాలతో దర్శనమిస్తోంది. తిరుమల క్షేత్రాన్ని దాదాపు 10 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని 60 వేల కట్‌ఫ్లవర్లతో అలంకరించారు. ప్రత్యేకించి ఆలయం ముందు రాముడు, మత్స్యావతారం, చిన్ని కృష్ణుడితోపాటు పలు అవతారాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అలాగే యుగాల సెట్టింగులు వేశారు. అద్దాల మండపం వద్ద అయోధ్యరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో మత్స్యావతారాన్ని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేశారు. ఆలయంతోపాటు మహద్వారం గేటుకు మామిడి, చెరకు, అరటి ఆకులతో అలంకరణలు చేశారు.


శ్రీవారి ఆలయం ముందు చిన్నికృష్ణుడి ప్రతిమలు

తిరుమలలో పలుచగానే భక్తులు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. సాధారణంగా ఉగాది పర్వదినానికి రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ పలుచగానే కనిపించింది. ఉదయం 6 గంటల సమయానికి దర్శనానికి డైరెక్ట్ లైన్ ఉండగా, సాయంత్రం 7 గంటల సమయానికి ఎనిమిది కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి 4 గంటల దర్శన సమయం పట్టింది. అలిపిరి టోల్‌గేట్ తోపాటు ఘాట్‌రోడ్లు ఖాళీగానే కనిపించాయి.



వాహనాలు లేక ఖాళీగా ఉన్న ఘాట్ రోడ్డు - ఆలయం ముందు పలుచగా ఉన్న భక్తులు